క్లుప్తంగా

ఏడుగురికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు ఏడుగురికి జరిమానా విధించినట్లు పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. బుధ, గురువారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో ఏడుగురిని అదుపులోకి తీసుకొని శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి నలుగురికి ఒక్కొక్కరికి రూ.2 వేలు, ఒకరికి రూ.3వేలు, మరో ఇద్దరికి రూ.5వేల చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు.

ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షిత ప్రయాణం



ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న డీఎం మల్లేశయ్య

నారాయణఖేడ్: ఆర్టీసీ బస్సుల్లో సురక్షితంగా ప్రయాణించవచ్చని డీఎం మల్లేశయ్య తెలిపారు. బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకొని నారాయణఖేడ్ రాజీవ్‌చౌక్ సమీపంలో డిపో పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడానికి ఆర్టీసీ కృషి చేస్తోందన్నారు. ఆయా పండుగల దృష్ట్యా ప్రయాణికులకు లక్కీడ్రా తీసి నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఖేడ్ డిపోనకు రూ.10లక్షల కలెక్షన్ వచ్చిందన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ సెల్ ఇన్‌చార్జీ పాండు, పరిరక్షణ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

పంట పొలాల్లో కారు బోల్తా



పంట పొలంలో బోల్తాపడిన కారు

కల్హేర్(నారాయణఖేడ్): పంట పొలాల్లోకి కారు దూసుకెల్లిన బోల్తా పడిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ముగ్గురు యువకులు షిఫ్ట్ కారులో పోమ్యానాయక్ తండా వైపు వెళ్తున్న క్రమంలో ప్రమాదవశత్తు నీలం వాగు వద్ద దిమ్మెకు ఢీకొట్టి పక్కన ఉన్న పంట పొలాల్లో బోల్తాపడింది. యువకులు ప్రమాదం నుంచి త్రుటిలో తప్పించుకున్నారు. స్థానికులు అక్కడికి చేరుకుని యువకులను బయటకు తీశారు.

క్వార్టర్ ఫైనల్‌కు ఎనిమిది భజన మండళ్లు



భజన చేస్తున్న భక్తులు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణంలోని చారిత్రాత్మకమైన భవానీ మందిరం ప్రాంగణంలో అంతర్రాష్ట్ర భజన పోటీలు ఆసక్తికరంగా కొనసాగుతున్నాయి. 8 భజన మండళ్లు క్వార్టర్ ఫైనల్‌కు చేరుకోగా శుక్రవారం షాద్‌నగర్, కర్నాటక రాష్ట్రంలోని బీదర్, ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్, బుద్ధారెడ్డి పల్లి భజన మండళ్లు జట్లు పోటీపడ్డాయి. భజన పోటీలను ఎమ్మెల్యే మాణిక్‌రావు, నాయకులు తిలకించారు. ఈ నెల 21న ఫైనల్ పోటీలు ఉంటాయని, విజేతకు నగదు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

ఎమ్మార్పీఎస్ పాదయాత్రకు కాంగ్రెస్ మద్దతు

హత్నూర(సంగారెడ్డి): ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్రకు కాంగ్రెస్ తరుపున తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు దానంపల్లి సుజాత అన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ బుచంద్ర మాదిగ ఆధ్వర్యంలో మండలం పరిధిలోని లింగాపూర్ నుంచి ప్రారంభించిన ఎస్సీ వర్గీకరణ పాదయాత్రకు శుక్రవారం కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణపై స్పష్టత ప్రకటించకపోవడం విచారకరమన్నారు. పాదయాత్ర లింగాపూర్, కొన్యాల, చీకుమద్దూర్ హత్నూర, దౌల్తాబాద్ మీదుగా పలు గ్రామాల్లో కొనసాగింది. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ బుచ్చంద్ర మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు గంధగల ప్రసాద్, నవీన్, వీరయ్య, అర్జున్, లక్ష్మీనారాయణ, నగేష్, రాములు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణ, యూత్ కాంగ్రెస్ నాయకులు మణిదీప్, సందీప్ పాల్గొన్నారు.

బోర్డులకే పరిమితం

- అలంకారప్రాయంగా క్రీడాప్రాంగణాలు
- అనువైన స్థలాల ఎంపికలో నిర్లక్ష్యం
- నిర్వహణ బాధ్యత గ్రామపంచాయతీలదేనని చేతులెత్తిసిన అధికారులు
- వినియోగంలోకి తేవాలని క్రీడాకారుల విన్నపం



బడంపేట గ్రామంలో క్రీడాప్రాంగణాన్ని ముంచెత్తిన చెరువునీరు



ఖానాపూర్‌లో నిరుపయోగంగా క్రీడామైదానం

కోహీర్(జహీరాబాద్): గ్రామీణ యువతలో శరీర దారుఢ్యానికి, మానసిక వికాసానికి క్రీడలను ప్రోత్సహించాలనే సదాశయంతో ప్రభుత్వం నిర్మించతలపెట్టిన క్రీడా ప్రాంగణాల ఏర్పాటు అధికారుల నిర్లక్ష్యంతో నీరుగారిపోతున్నాయి. ఏడాది క్రితం నిర్మించిన క్రీడాప్రాంగణాలు నేటికి నిరుపయోగంగా మారాయి. తద్వారా ప్రభుత్వ ఆశయం నెరవేరకపోగా ఏర్పాటు కోసం వెచ్చించిన రూ.లక్షల ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరులా మారిందని క్రీడాకారులు వాపోతున్నారు. మండల పరిధిలోని ప్రతి గ్రామ పంచాయతీలో క్రీడాప్రాంగణం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. దీంతో కనీసం ఎకరా ప్రభుత్వ స్థలం సమకూర్చుకోవాలని అధికారులను ఆదేశించగా 28 గ్రామ పంచాయతీలలో క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేశారు. ఎంపిక చేసిన స్థలాన్ని చదును చేసి ఒక సింగిల్ బార్, డబుల్ బార్, కబడ్డీ, వాలీబాల్ కోర్టులను ఏర్పాటు చేశారు. అయితే నాలుగైదు గ్రామాలు మినహా మిగతా గ్రామ పంచాయతీలో క్రీడామైదానాలు ఆటలు ఆడేందుకు అనుకూలంగా లేవు.

గ్రామాలకు దూరంగా..

ఆయా గ్రామాల్లో స్థల ఎంపికలో రెవెన్యూ అధికారులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించారు. టార్గెట్లు పూర్తి చేయడంలో చూపిన శ్రద్ధ అనువైన స్థల ఎంపికలో చూపలేదు. మండలంలోని బడంపేట గ్రామంలో దేవునిచెరువు శిఖం భూమిలో క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. దీంతో వర్షాలకు చెరువు నీరంతా క్రీడాప్రాంగణాన్ని ముంచెత్తింది. వేసవిలో చెరువు నీరు ఎండిపోయినప్పుడు మాత్రమే అనుకూలంగా ఉంటుందని గ్రామస్తులు తెలుపుతున్నారు. అదేవిధంగా చింతల్‌ఘాల్, గురుజువాడ, పీచేర్యాగడి, పీచేర్యాగడి తండా, క్రీడాప్రాంగణాలు ఆయా గ్రామాలకు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి.

అనువుగాని స్థలాల ఎంపిక..

పైడిగుమ్మల్, ఖానాపూర్, లాల్‌సింగ్ తండాలో క్రీడాప్రాంగణాలకు సరిపడ స్థలం కేటాయించకపోవడంతో పాటు స్థలాలు పూర్తిగా గుంతలమయంగా ఉన్నాయి. దీంతో స్థలాన్ని చదును చేయడంలో గ్రామ పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని క్రీడాకారులు వాపోతున్నారు.

పాఠశాలల స్థలాల్లో క్రీడాప్రాంగణాల ఏర్పాటు..

మండలంలోని కొత్తూర్(డి) గ్రామంలో గ్రామ పంచాయతీ, పాఠశాల భవనాల నిర్మాణం కోసం గతంలో కేటాయించిన స్థలంతో పాటు మేజర్ గ్రామ పంచాయతీ కోహీర్‌లో మైనార్టీ బాలికల పాఠశాల కోసం కేటాయించిన స్థలాల్లోనే క్రీడాప్రాంగణాలను ఏర్పాటు చేసేందుకు స్థలాలను కేటాయించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకురావాలని క్రీడాకారులు కోరుతున్నారు.

శిఖం భూమిలో ఏర్పాటు చేశారు



మా గ్రామంలో దేవునిచెరవు శిఖం భూమిలో క్రీడాప్రాంగణం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం మైదానాన్ని చెరువునీరు పూర్తిగా ముంచెత్తింది. ఏడాదిలో ఎనిమిది నెలలు నిరుపయోగంగా ఉంటుంది. వేసవిలో నాలుగు నెలలు మాత్రమే మైదానం ఆటలు ఆడేందుకు అనువుగా ఉంటుంది. దీంతో ప్రత్యామ్నయంగా వేరే చోట స్థలం ఎంపిక చేయాలి.

– శ్రీనివాస్, బడంపేట గ్రామస్తుడు

నిర్వహణ బాధ్యత పంచాయతీలదే



క్రీడాప్రాంగణాల నిర్వహణ, స్థలాల ఎంపిక, క్రీడా సామగ్రిని కాపాడుకోవాల్సిన బాధ్యత ఆయా గ్రామ పంచాయతీలకే ఉంటుంది. గ్రామీణ యువతకు క్రీడల పట్ల పోత్సాహం అందించేందుకు ప్రభుత్వం క్రీడాప్రాంగణాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. యువత క్రీడల్లో రాణించేవిధంగా ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

– సుజాతనాయక్, ఎంపీడీఓ, కోహీర్

నిండు మనసుతో ఆశీర్వదించండి

- పదేళ్లలో పట్టణ రూపురేఖలు మార్చాం
- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: పదేళ్ల కాలంలో చేసిన అభివృద్ధిని చూసి నిండు మనసుతో ఆశీర్వదించి గెలిపించాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కోరారు. పటాన్‌చెరు పట్టణంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి పార్టీ మేనిఫెస్టోను వివరిస్తూ ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పటాన్‌చెరు నియోజకవర్గాన్ని గత పదేళ్ల కాలంలో అన్నిరంగాల్లో అభివృద్ధి చేశానని తెలిపారు. ప్రతి వీధిలో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, వీధి దీపాలు ఏర్పాటు తదితర అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. అర్హులైన ప్రతిఒక్కరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లను పంపిణీ చేశామన్నారు. అభివృద్ధి సంక్షేమం మరింత ముందుకు వెళ్లాలంటే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్‌ను మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయకుమార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు అఫ్జల్, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్‌రెడ్డి, గూడెం కల్పన, కంకర శీను, వెంకటేష్, గుండమల్ల రాజు, నవీన్‌రెడ్డి, మంగలి వినోద్, మాధవి, కొండల్, ధనరాజ్‌గౌడ్, శ్యామ్, అరుంధతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణను ఆగం చేసేందుకు కుట్ర

- కాంగ్రెస్, బీజేపీలను నమ్మొద్దు
- ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): అభివృద్ధిలో దూసుకుపోతున్న తెలంగాణ రాష్ట్రాన్ని ఆగం చేసేందుకు కాంగ్రెస్, బీజేపీ నేతలు కుట్ర పన్నారని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆరోపించారు., సిర్గాపూర్ మండలంలోని కిషన్‌నాయక్ తండాలో శుక్రవారం బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం సంగెం, చీమాల్‌పాడు, గౌడ్‌గాంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓట్ల కోసం రాజకీయాలు చేసే నాయకుల మాటలు నమ్మి గోస పడొద్దన్నారు. కాంగ్రెస్ గ్యారెంటీ కార్డు ఉత్తుత్తి హామీలన్నారు. బీఆర్‌ఎస్ మెనిఫెస్టోను ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రపు మహిపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ రాఘవరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గుండు వెంకట్‌రాంలు, రైతుబంధు అధ్యక్షుడు కృష్ణామూర్తి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు సంజీవరావు, సర్పంచ్‌లు రవీందర్‌రావు, సంజీవరెడ్డి, బసిరెడ్డి, ఎంపీటీసీ శాంతిబాయి నాయకులు మాధవరావుపాటిల్, శ్రీనివాస్‌రావు, యాదవరావు పాల్గొన్నారు.

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: పట్టణంలోని షెట్కార్ పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా వ్యవసాయ అభివృద్ధి శాఖను పట్టణంలోని రాజీవ్‌చౌక్ సమీపంలోని భవనంలోకి శుక్రవారం మార్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజల్లో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనా నజీబ్, వైస్‌చైర్మన్ పరశురాం, మనూరు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు విఠల్‌రావు, బొక్కస్‌గాం పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రాములు, నాయకులు, బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

జహీరాబాద్: మండలంలోని రాయిపల్లి(డి) గ్రామానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. జహీరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి చంద్రశేఖర్ పార్టీలో చేరినవారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ కాంగ్రెస్‌ను అధికారంలోకి వస్తేనే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకుడు అనంత్‌నవీన్ పాల్గొన్నారు.



కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి చంద్రశేఖర్ సమక్షంలో పార్టీలో చేరిన రాయిపల్లి(డి) గ్రామస్తులు

ముమ్మరంగా తనిఖీలు

జహీరాబాద్ టౌన్: ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దులో మాడ్గి, హుసెళ్లిల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా చిరాగ్‌పల్లి ఎస్‌ఐ నరేష్ మాట్లాడుతూ కోడ్ అమల్లో ఉన్న కారణంగా ఎలాంటి ఆధారాలు లేకుండా డబ్బు, వస్తువులు, అభరణాలు తీసుకెళ్లే అవకాశం లేదన్నారు. ఎన్నికల కోడ్ పాటించనివారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



తనఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

ముదిరాజ్‌ల సత్తా చాటుతాం



నియామక పత్రాలను అందజేస్తున్న సపానదేవ్, టప్ప కుమార్

పటాన్‌చెరు టౌన్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ముదిరాజ్‌ల సత్తా చాటుతామని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సపానదేవ్ అన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని ముదిరాజ్ భవన్‌లో శుక్రవారం ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు టప్ప కుమార్ ఆధ్వర్యంలో జిల్లా నూతన కార్యవర్గ నియామక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సపానదేవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ముదిరాజ్‌లు తలుచుకుంటే 30 నుంచి 40 సీట్లు గెలిచే సత్తా ఉందన్నారు. ప్రభుత్వం ముదిరాజ్‌లకు ఒక్క సీటు కూడా కేటాయించకపోవడం బాధాకరమన్నారు. అనంతరం నూతనంగా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా ప్రచార కార్యదర్శిగా నాగసాని నరేష్, ఉపాధ్యక్షుడిగా ఎట్టయ్య, కార్యదర్శులుగా చింతల సాయి ముదిరాజ్, లక్ష్మి, కార్యనిర్వహణ కార్యదర్శిగా నాగసాని వెంకటేష్, బాలరాజ్, సునంద ఎన్నుకొని నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వివిధ మండలాలకు చెందిన ముదిరాజ్‌లు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థలను స్వాధీనం చేసుకోవాలి



మాట్లాడుతున్న సురేష్

జహీరాబాద్ టౌన్: కార్పొరేట్ విద్యాసంస్థలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న పీడీఎస్‌యూ నియోజకవర్గ స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు శుక్రవారం రెండవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ విద్యా వ్యవస్థను ప్రభుత్వం నీరుగార్చిందన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు ప్రాధాన్యమిస్తూ ప్రభుత్వ విద్యా సంస్థలను విస్మరిస్తోందన్నారు. ఇష్టారాజ్యంగా ఫీజులను వసూలు చేస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలను మూసివేయించాలని డిమాండ్ చేశారు. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షుడు సందీప్, నాయకులు ఆకాష్, ఏలియా, శ్రీధర్‌రెడ్డి, హర్షిత్, కొటేశ్వర్‌రావు, పాల్‌రాజ్, భాస్కర్, రోహిత్, సంకేత్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల ఇంటింటి ప్రచారం



ప్రచారం చేస్తున్న నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని నల్తూర్, కొర్లకుంట గ్రామాల్లో ఆరు గ్యారెంటీ స్కీంలను ప్రజలకు వివరించేందుకు శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డె కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ తాము చేపడుతున్న ప్రచారానికి అన్ని వర్గాల ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

'కాంగ్రెస్‌తోనే అభివృద్ధి'



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నియోజవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదుల నాగులపల్లిలో కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ పథకాలను ఇంటింటికి వెళ్లి వివరించారు. అనంతరం మున్సిపల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సీఎం కేసీఆర్ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ విజయాన్ని ఎవరూ ఆపలేరు

జెడ్పీటీసీ కుమార్‌గౌడ్



మాట్లాడుతున్న కుమార్‌గౌడ్

జిన్నారం(పటాన్‌చెరు): రాబోయే ఎన్నికల్లో మరోసారి బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుందని, బీఆర్‌ఎస్ విజయాన్ని ఎవరూ ఆపలేరని గుమ్మడిదల జెడ్పీటీసీ కుమార్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని దోమడుగు, మంబాపూర్ గ్రామాల్లో పార్టీ కార్యకర్తల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కుమార్‌గౌడ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా మహిపాల్‌రెడ్డి హ్యాట్రిక్ విజయాన్ని సాధిస్తారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు హుస్సేన్, నాయకులు విజయభాస్కర్ రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమం

జిన్నారం(పటాన్‌చెరు): బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమం సాధ్యమని బీఆర్‌ఎస్ యువజన నేత, ఎమ్మెల్యే కుమారుడు విక్రంరెడ్డి అన్నారు. శుక్రవారం జిన్నారంలోని ఓ ఫంక్షన్ హాలులో శుక్రవారం మండలంలోని అన్ని గ్రామాల యువజన విభాగం నాయకులు, యువకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విక్రంరెడ్డి మాట్లాడుతూ యువతకు ఉపాధిని కల్పించేలా ప్రభుత్వం అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. మరోసారి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల యువజన విభాగం నాయకులు, యువకులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులపై అవగాహన

నారాయణఖేడ్: ఖేడ్ నియోజకవర్గంలో సెక్టార్, రూట్ అధికారులు, వీఎస్‌టీ, ఎఫ్‌ఎస్‌టీ, వీవీటీ టీంలకు చెందిన అధికారులకు రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఎన్నికలకు సంబంధించిన విధులపై అవగాహన కల్పించారు. నియోజవర్గానికి ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్న ఆర్డీఓ వెంకటేష్ అధికారులు, ఆయా టీంలకు సంబంధించిన విధుల పట్ల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ దేవీదాస్, సీఐ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈఆర్వో వెంకటేష్

బీఆర్‌ఎస్‌కు నరేందర్‌రెడ్డి రాజీనామా



రాజీనామా పత్రాన్ని చూపుతున్న నరేందర్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల బీఆర్‌ఎస్ మాజీ మండల అధ్యక్షులు, మాజీ ఉపసర్పంచ్ నరేందర్‌రెడ్డి బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు శుక్రవారం ప్రకటించారు. ఇందుకు సంబంధించిన రాజీనామా పత్రాన్ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చింతా ప్రభాకర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ తనకు బీఆర్‌ఎస్‌లో సరైన గుర్తింపు లేనందునే రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ నేత కాటా శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరుతానని చెప్పారు.

అదేబాటలో ఎంపీ అశోక్..

జిన్నారం మండలంలోని గడ్డపోతారం మాజీ సర్పంచ్ ఎంపీ అశోక్ బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. ఎంపీపీ రవీందర్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, మండల అధ్యక్షులు వడ్డె కృష్ణలతో ఎంపీ అశోక్ సమావేశమయ్యారు. బీఆర్‌ఎస్ తీరు సరిగాలేదని అందుకే తాను కాంగ్రెస్‌లో చేరుతానని ప్రకటించారు.

ఫొటోగ్రాఫర్‌లకు అండగా ఉంటా



నీలం మధుతో నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

పటాన్‌చెరు టౌన్: ఫొటోగ్రాఫర్‌లకు అండగా ఉంటానని ఎన్‌ఎంఆర్ వ్యవస్థాపకుడు నీలం మధు అన్నారు. మండలంలోని రుద్రారం, చందానగర్ ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ యూనియన్ అధ్యక్ష ఎన్నికలను శుక్రవారం నిర్వహించారు. రెండు వర్గాల మధ్య హోరాహోరీగా జరిగిన ఈ ఎన్నికల్లో అనిల్‌కుమార్ రెండు ఓట్ల తేడాతో కృష్ణయాదవ్‌పై విజయం సాధించారు. నూతనంగా ఎన్నికైన అనిల్ ప్యానల్ చిట్కుల్‌లో నీలం మధు ముదిరాజ్‌ను మర్యాద పూర్వకంగా ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్ కుమార్, జనరల్ సెక్రెటరీ లకోష్మరెడ్డితో పాటు కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లకోష్మరెడ్డి, సభ్యులు వీరేశం, నరసింహ, తన్మయి, రజినీకాంత్, జగన్, రాజేష్, రవీందర్ పాల్గొన్నారు.

ముదిరాజ్ మహాసభ ఇన్‌చార్జిగా సత్యనారాయణ

జోగిపేట(అందోల్): ముదిరాజ్ మహాసభ అందోల్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా అందోల్ జోగిపేట మున్సిపల్ 17వ వార్డు కౌన్సిలర్, జిల్లా యువత నాయకులు ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు), జిల్లా మహిళా అధ్యక్షురాలుగా జోగిపేట పట్టణానికి చెందిన అయ్యప్పనిర్మలను నియమిస్తూ జిల్లా ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు టప్ప కుమార్ ముదిరాజ్ నియామకపత్రాలను అందజేశారు. పటాన్‌చెరు ముదిరాజు భవన్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ, అయ్యప్పనిర్మల మాట్లాడుతూ నియోజకవర్గంలో ముదిరాజ్‌లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ముదిరాజులు రాజ్యాధికారం దిశగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సపాన్‌దేవ్, రాష్ట్ర పోలిట్‌బ్యూరో సభ్యులు నారాయణ తదితరులు పాల్గొన్నారు.